ప్రజాశక్తి

గురువారం 1 ఫిబ్రవరి 2024

పోలీస్ డైరీ-2024 ఆవిష్కరణ

పోలీసు డైరీ-2024ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

జిల్లా ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ పోలీస్ డైరీ-2024ను బుధవారం నాడు జిల్లా పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో ఆవిష్కరించారు. పోలీసులకు సంబంధించి సమగ్ర సమాచారం కలిగి ఉన్న డైరీ పోలీస్ సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ తెలియజేశారు. పోలీస్ డైరీ - 2024 తయారీకి కషి చేసిన అందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయ భాస్కర్‌రెడ్డి, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, శివ ప్రసాద్, వెంకట రమణ, సరోజ పాల్గొన్నారు.

రాయదుర్గంలో..

రాజకీయ కాక

- ఎమ్మెల్యే Vs ఛైర్‌పర్సన్
- మున్సిపల్ కౌన్సిల్ మీట్‌లో వాదోపవాదాలు
- విప్ కాపును ఎదిరించిన ఛైర్‌పర్సన్

రాయదుర్గం రాజకీయాలు వేడెక్కుతున్నాయి. అధికార పార్టీలో పరిస్థితి రోజుకోమలుపు తిరుగుతోంది. అధిష్టానం సమన్వయ కర్తను మార్చిన తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఇప్పటి వరకు కాపు రామచంద్రారెడ్డి వెంట నడిచిన వారే ఆయన్ను నిలదీసే పరిస్థితి వచ్చింది. తాజాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మధ్య మాటల యుద్ధం నడిచింది. ఒకరిపై ఒకరు వేలు చూపించుకుంటూ వాదోపవాదాలు చేసుకున్నారు. ఈ ఘటనతో మున్సిపల్ సమావేశం ఒక్కసారిగా వేడెక్కింది.

ఒకరిపై ఒకరు వేలి చూపించుకుంటూ విమర్శలు చేసుకుంటున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం పాలకమండలి సమావేశం బుధవారం ఉదయం అధ్యక్షురాలు పొరాలు శిల్ప అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యులుగా హాజరయ్యారు. గత కొంతకాలంగా ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్ మధ్య విభేదాలు ఉన్నాయి. అయితే అవి ఎప్పుడూ బహిర్గతం కాలేదు. బుధవారం జరిగిన సమావేశంలో అవి బహిర్గతం అయ్యాయి. ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి మాట్లాడు తుండగా ఛైర్‌పర్సన్ శిల్ప అడ్డుతగిలారు. తాను మాట్లాడేప్పుడు అడ్డురావద్దని ఊరికే ఉండాలని ఎమ్మెల్యే ఆమె వైపు వేలెత్తి చూపించారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. గతంలో రామచంద్రారెడ్డి సిఫార్సు మేరకే శిల్ప ఛైర్‌పర్సన్ స్థానాన్ని చేపట్టారు. తరువాత మున్సిపాల్టీలో ఆమె మాట చెల్లుబాటు కాకపోవడంతో తీవ్ర అసంతప్తికి లోనైంది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ మధ్య రెండు వర్గాలుగా విడిపోయారు. ప్రతి పనికీ ఒక వర్గం మరో వర్గం అడ్డుకోవడం పరిపాటిగా మారింది. దీంతో మున్సిపాల్టీలో అభివద్ధి కుంటుబడుతూ వచ్చింది. ఈ క్రమంలో రాయదుర్గం వైసిపి సమన్వయకర్త మార్పు అంశం విభేదాలను మరింత తారాస్థాయికి చేర్చింది. ఏకంగా ఛైర్‌పర్సన్ ఎమ్మెల్యేను నిలదీసి ప్రశ్నించారు. జీరో అవర్‌లో సభ్యులు తాగునీటి ఎద్దడి, జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉన్నందున మార్కింగ్ అయ్యాక శ్మశానవాటిక ప్రహరీ పనులు చేపట్టాలని కోరారు. అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకోవాలని, అందాక రిజిస్ట్రేషన్లు ఆపాలని ఎమ్మెల్యే కోరారు. పాలక మండలిలో రెండు వర్గాలు ఉన్నాయని, అలాంటప్పుడు ఎలా కలిసి పనులు చేస్తారని కొందరు సభ్యులు ఆరోపించారు. ఇందుకు ఛైర్‌పర్సన్ సమాధానం ఇస్తూ తాము ఎలాంటి వర్గాలు ఏర్పాటు చేయలేదని, చేసే పనులను కొందరు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నట్లు ఆరోపించారు. ఇలా సమావేశం జరుగుతున్నంత సేపూ ఒకరిపై ఒకరు వాదనలు చేసుకున్నారు.

కాపుపై వైసిపి నేతల ఫైర్

రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిపై వైసిపి నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం రాయదుర్గంలోని వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పైల నరసింహయ్య, నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వీరాంజనేయులు మాట్లాడారు. కాపు రామచంద్రారెడ్డి బుధవారం నాడు రాయదుర్గం మున్సిపల్ కార్యాలయంలో వ్యవహరించిన తీరు సరికాదన్నారు. కాపు నెలరోజుల క్రితం జగన్‌మోహన్‌రెడ్డిని దేవుడు అంటూ పొగిడి ఇప్పుడు ఆయన్ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఆయనకు టికెట్ రాకపోయే సరికి మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపు రామచంద్రారెడ్డికి రాజకీయ గుర్తింపును ఇచ్చింది వైఎస్ఆర్ కుటుంబం అన్న విషయాన్ని ఆయన గుర్తించుకోవాలన్నారు. కాపు తాటాకుచపళ్లకు భయపడేవారు వైసిపిలో ఎవరూ లేదన్నారు. విలేకరుల సమావేశంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్ర రెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ శివప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలి భాషా పాల్గొన్నారు.

సొంత నిధులతో అభివృద్ధి చేశా : కాపు

కోట్ల రూపాయల సొంత నిధులతో రాయదుర్గం పట్టణాన్ని అభివృద్ధి చేశానని, ఎన్నికల తర్వాత కూడా పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి సిఎం జగన్ జేబు నుంచి నిధులు ఇవ్వడం లేదని, అవి రాష్ట్ర ప్రభుత్వ నిధులే అన్నారు. నియోజకవర్గంలో తాను చేస్తున్న సేవలను ఓర్వలేని కొందరు తనకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేశారన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు తనను ఎప్పుడైనా కలవొచ్చన్నారు. అనివార్య పరిస్థితుల వల్ల తాను వైసిపికి దూరం కావాల్సి వచ్చిందన్నారు.

వసూలు చేసి.. జమచేయడం మానేసి..!

- విత్తన, ఎరువుల సంస్థలకు చెల్లించని ఉద్యోగులు
- రూ.20లక్షల వరకు బకాయిలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించిన ఎరువులు, సబ్సిడీ విత్తనాలకు సంబంధించి డబ్బులను రైతుల నుంచి వసూలు చేశారు... ఆ డబ్బులను ఆయా సంస్థలకు చెల్లించే విషయంలో మాత్రం ఉద్యోగులు కాలయాపన చేస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో ఇలా చెల్లింపులు చేయని వారు అధికంగానే ఉన్నారు. చిన్న మొత్తాలుగానే కనిపిస్తున్నా ఈ ఘటన చిరుద్యోగుల పనితీరు ఏ విధంగా ఉందని చెప్పేందుకు నిదర్శనంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతు భరోసా కేంద్రాల నుంచి ఎరువులు, విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు ముందుగా డబ్బులు చెల్లించి తమకు అవసరమైనవి తీసుకుంటారు. వసూలు చేసిన ఈ డబ్బులను ఆయా సంస్థలకు వసూలు చేసిన విహెచ్ఎ (విలేజ్ అనిమల్ హాస్బండరీ అసిస్టెంట్లు) విఎస్ఎ(విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లు) మరికొందరరు వారి వద్దనే ఉంచుకున్నారు. ఈ రకంగా చూస్తే 2023 సీజన్‌లో 29 రైతుభరోసా కేంద్రాల్లో కలిపి రూ.3.37 లక్షలు బకాయిలున్నాయి. ఇందులో రొళ్ల మండలంలోని గుడిగురికి రైతు భరోసా కేంద్రంలోనే రూ.1.16 లక్షల బకాయి ఉంది. తనకల్లు సదుంలో రూ.35 వేలు, కదిరి మండలం ఎగువపల్లిలో రూ.26 వేలు, నల్లచెరువు-2లో రూ.23 వేలు ఇలా బకాయిలు పెద్ద మొత్తంలోనే ఉన్నాయి. మడకశిర మండలం మన్నూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం నుంచి కూడా రూ.1.18 లక్షలు బకాయి ఉంది. విహెచ్ఎల నుంచి రూ.1.40 లక్షలు బకాయిలున్నాయి. రబీకి సంబంధించి మూడు రైతు భరోసా కేంద్రాల నుంచి రూ.94 వేలు బకాయిలున్నాయి. ఇవి కాకుండా ఇంకా 2022-23, 2023-24 కలిపి మొత్తం రూ.20 లక్షల వరకు విత్తనాలకు సంబంధించి బకాయిలు ఉన్నాయి. ఎరువులకు సంబంధించి కూడా పెద్దఎత్తునే బకాయిలున్నట్టు సమాచారం. అనంతపురం జిల్లా బుక్కరాసయముద్రం మండల పరిధిలో పెద్ద మొత్తంలో డబ్బులను కాజేసి అడ్రసు లేకుండాపోయి ఉన్నాయి.

చెల్లించమని తాఖీదులిస్తున్నా..

వసూలు చేసి జమ చేయకుండా ఉన్న డబ్బులు సంస్థకు జమ చేయాలని అటు ఎపి సీడ్స్, ఇటు మార్కెటింగ్ శాఖ నుంచి ఆయా చిరుద్యోగులకు తాఖీదులిస్తున్నా పట్టించుకోనట్టు తెలుస్తోంది. చిన్న మొత్తాలే అన్న నిర్లక్ష్యం ఒకవైపు ఉండగా ఏమవుతుందన్న ధీమాతోనే డబ్బులు జమ చేయడం లేదని తెలుస్తోంది.

వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నాం..

ఇప్పటి వరకు మొత్తం రూ.20 లక్షల వరకు బకాయిలున్నాయి. వాటిని చెల్లించాలని రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రయత్నం చేస్తున్నాం. ఈ రెండు రోజుల్లోనే రూ.2 లక్షల వరకు వసూలు అయ్యాయి. తక్కినవి కూడా వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

సుబ్బయ్య, ఎపి సీడ్స్, జిల్లా మేనేజరు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో అర్హత ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. బుధవారం నాడు అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేస్తున్న ఇళ్ల స్థలాలకు సంబంధించి జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఒ గాయత్రి దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవో 535లో ఉన్న అన్ని నిబంధనలను పాటించి అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఐదు సంవత్సరాల అక్రిడేషన్ అనుభవం కలిగిన వారిని కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, విజయవాడ వారు గుర్తించి పంపిన ప్రాథమిక జాబితాను పరిశీలించిన అనంతరం తుది జాబితా మేరకు స్థలాలు ఇస్తామన్నారు. ప్రస్తుతం 335 దరఖాస్తులు వచ్చాయని వాటిని మండలాల తహశీల్దార్లకు పంపించి పరిశీలన చేస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించేందు కోసం అవసరమైన స్థలాన్ని సేకరించాలని ఆర్డీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ సభ్యులు జి.రామచంద్రారెడ్డి, ఆర్.భోగేశ్వర్ రెడ్డి, పి.శ్రీనివాసులు, ఐఅండ్ పీఆర్ డిఐపిఆర్ఒ గురుస్వామి శెట్టి, ఆర్డీవోలు జి.వెంకటేష్, రాణి సుస్మిత, గుంతకల్ ఆర్డీవో కార్యాలయం డీఏవో భూషణం, కలెక్టరేట్ ఈసెక్షన్ సూపరింటెండెంట్ బాలాజీ, పీఆర్వో సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

ఇద్దరు కాపరులు.. 20 గొర్రెలు మృతి

ప్రమాద స్థలంలో గొర్రెల మృతదేహాలు

ఘటనా స్థలంలో మృతి చెందిన గొర్రెల కాపరులు రుద్రేష్, గోపాల్(ఫైల్ పాటోలు)

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గం డి.హీరేహాల్ మండలం మడేనహళ్లి గేటు సమీపంలో బుధవారం వేకువజామున తీవ్ర విషాధ ఘటన చోటు చేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న గొర్రెల మందపై ఓ లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు గొర్రెల కాపరులు, 20 గొర్రెలు మరణించాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో గొర్రెల కలబరాలతో భయానకంగా కన్పించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కర్నాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సొండూరు తాలూకా నక్కలపల్లికి చెందిన రుద్రేష్(21), గోపాల్(17) మేత కోసం డి.హీరేహాల్ ప్రాంతానికి గొర్రెలను తీసుకొని వచ్చారు. బుధవారం ఉదయం జీవాలను నాగలాపురం వద్దకు తీసుకుని వెళ్తున్నారు. ఇదే సమయంలో బళ్లారి నుంచి సిమెంటు లోడుతో బెంగళూరు- బళ్లారి జాతీయ రహదారి 157 మీదుగా కేరళ రాష్ట్రానికి వెళ్తున్న లారీ మడేనహళ్లి గేటు వద్ద రోడ్డు దాటుతున్న గొర్రెల మందపై అతి వేగంగా దూసుకెళ్లింది. ఈ ఘటనలో గొర్రెల కాపరులు రుద్రేష్ అక్కడికక్కడే మరణించాడు. గోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సాయంతో గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గోపాల్ కూడా మరణించాడు. ఇదే ప్రమాదంలో 20 గొర్రెలు మతి చెందాయి. గొర్రెలు కాస్తున్న మరో వ్యక్తి త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న డి.హిరేహాల్ పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీ, డ్రైవర్‌ను పోలీసులు చెళ్లికెర వద్ద పట్టుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సేవాఘడ్ మీదుగా బస్సులు నడపాలి

వినతిపత్రం అందిస్తున్న ఎఐబిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జన్మస్థలం సేవాఘడ్‌కు అనంతపురం నుంచి ఆర్‌టిసి బస్ సర్వీసులు నడపాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షులు ఎస్.బాలాజీ నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్‌టిసి ఆర్ఎం సుమంత్ ఆర్.ఆదోనికి బుధవారం నాడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు బాలాజీ నాయక్ మాట్లాడుతూ సేవాఘడ్‌లో సేవాలాల్ మహారాజ్, మాతా జగదాంబ అమ్మవార్ల దేవాలయాలు ఉన్నాయన్నారు. గిరిజన విద్యా సంస్థలు కూడా ఉన్నందున ఆర్టీసీ అధికారులు గుర్తించి ఆ ప్రాంతంలో బస్సులను నడపాలని కోరారు. స్పందించిన ఆర్ఎం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా సేవాఘడ్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతామని, రెగ్యులర్ సర్వీస్ నడపడానికి పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సుగుణబాయి, కార్యదర్శి శివమ్మ, కోశాధికారి పరమేష్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, జాయింట్ సెక్రటరీ ఈశ్వరిబాయి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గోవిందు నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'ఇంటింటికీ వైసిపి'



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం : నగరంలోని 10వ డివిజన్‌లో నాలుగో రోజైన బుధవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 'ఇంటింటికీ వైసిపి' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, మళ్లీ వైసిపికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నగరంలో కమిషనర్ ముమ్మర పర్యటన

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ బుధవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సెంట్రల్ పార్క్ కంపోస్టు యార్డు, తదితర వాటిని పరిశీలించారు. బిందెలకాలనీలో పారిశుధ్యం నిర్వహణలో అధికారుల వైఫల్యంపై అసహనం వ్యక్తం చేశారు. సెంట్రల్ పార్క్ స్థలాన్ని పరిశీలించి నగరపాలక సంస్థ స్థలం ఎంత ఉందని, ప్రస్తుత పరిస్థితుపై ఆరా తీశారు. కంపోస్టు యార్డులో చెత్త నిర్వహణ, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను ఆరా తీశారు. తడకలేరు వద్ద నూతనంగా రూ. 29.76 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎస్టిపీ ప్లాంట్‌పై పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ సతీష్‌చంద్ర కమిషనర్‌కు వివరించారు. హరిశ్చంద్ర ఘాట్ వద్ద శవాల దహనవాటిక ఏర్పాటు, సూర్యానగర్‌లో నిర్మాణంలో వున్న రోడ్డును పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీర్ సూర్యనారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష, ఇన్‌ఛార్జి ఎంహెచ్ఒ సంగం శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మోడల్ పేపర్స్ అందజేత

కళ్యాణదుర్గం : కంబదూరు మండలం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు సీనియర్ ఉపాధ్యాయుడు ఎ.విజయకుమార్ మోడల్ పేపర్స్ పుస్తకాలను బుధవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.పరమేశ్వరప్ప చేతుల మీదుగా విద్యార్థులకు వీటిని అందించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించండి

రిలేనిరహార దీక్షల్లో యుటిఎఫ్ నేతలు

అనంతపురం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నాడు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నాలుగు రోజుల పాటు చేపట్టే దీక్షలను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప ముఖ్య అతిథిగా హాజరై దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటామని, ఉద్యోగుల అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే వాటిని విస్మరించారన్నారు. సర్కార్ ఈ ఐదేళ్ల కాలంలో ఉద్యోగులకు చేసింది ఏమీ లేదన్నారు. ఉద్యోగులను వేధించడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన వేతనాలను అమలు చేస్తామని ఉద్యోగుల వేతనాల్లో కోత విధించి ప్రభుత్వం చరిత్రకెక్కిందన్నారు. సిపిఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకుండా దుర్మార్గపూరితమైన జిపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. ఎన్నో పోరాటాల చేసి రద్దు చేయించుకున్న అప్రెంటీస్ విధానాన్ని మళ్లీ ఈ ప్రభుత్వం తీసుకురావడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అప్రెంటీస్ విధానాన్ని అమలు చేస్తే కలిసివచ్చే అన్ని ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆర్థిక బకాయిలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సరళ, జిల్లా కార్యదర్శి ప్రమీల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేంద్రమ్మ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, నాగేంద్ర వెంకటనాయుడు, గంగాధర్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సేవాభావం అవసరం

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

సమావేశంలో మాట్లాడుతున్న బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ భోయ గిరజమ్మ తెలిపారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ముగింపు కార్యమాన్ని బుధవారం నాడు కురుగుంట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల నందు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శశాంక మౌళి, ఐక్య రాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాతి భరత్, అనతరపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విష్ణు ప్రియ, బాలయోగి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉదయశ్రీ హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. జెడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యువత చదువుతో పాటు సేవాభావం కలిగి ఉండాలన్నారు. యువత నైపుణ్యతను పెంపొందించుకుని తమ జీవితంలో ఉన్నతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జి.నమిత, రఘు, కె.మహేంద్ర, ధోని, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జయమాలిటీ పవన్, సాకే రాజా, గణేష్, తుకారాం, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాచానపల్లిలో ఆర్‌బికె ప్రారంభం

రాచానపల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రూరల్ మండలంలోని రాచానపల్లి గ్రామంలో బుధవారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ రైతు ఇంటి వద్దకే సేవలు అందించడం కోసం ప్రతి గ్రామంలో ఆర్‌బికె ఏర్పాటు చేశారని తెలిపారు. ఇక్కడి నుంచే రైతులకు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనంతపురం వ్యవసాయ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవి, ఎఒ సాయిలక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ర్యాగింగ్ నిరోధం, మాదక ద్రవ్యాల పర్యవసనాలు, బాల్య వివాహాల చట్టం, దిశ యాప్, సైబర్ నేరాలు, డయల్ - 100, రోడ్డు ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరిస్తున్నారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

గ్రామగ్రామానికి కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

'గ్రామగ్రామానికి కాంగ్రెస్ పార్టీ'

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామగ్రామానికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని బుధవారం నాడు మండల పరిధిలోని మల్లిపల్లి, కోడిపల్లి, వర్లీ, కాపార్లపల్లి, ముద్దినాయనపల్లి, ఎం.వెంకటాంపల్లి, కొండాపురం, తిమ్మసముద్రం, మంగళకుంట, కడదారకుంట, పింజిరి కొట్టాల, బాలవెంకటాపురం, కదరాంపల్లి, నుసికొట్టాల, మానిరేవు, ఓబుళాపురం గ్రామాల్లో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. కళ్యాణదుర్గం అభివృద్ధి కోసం 2024 ఎన్నికల్లో మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డిని గెలిపించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి, పీసీసీ సభ్యుడు తిమ్మప్ప, డిసిసి ప్రధాన కార్యదర్శి కరీంసాబ్, డిసిసి కార్యదర్శులు బలరాం, భాస్కర్ రాజు, కంబదూరు మండల కన్వీనర్ ఈరన్న, శెట్టూరు మండల కన్వీనర్ మల్లయ్య, ఈశ్వర్ ప్రసాద్, చెన్నంపల్లి మధు, రవి, నరేష్, నరేంద్ర, మర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు వేతనం చెల్లించాలి

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు సమ్మె కాలపు వేతనం చెల్లించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మేఘస్వరూప్‌కు వినతి పత్రం సమర్పించారు. అలాగే వారి సమస్యలను కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్, నల్లప్ప, లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు

ప్రజాశక్తి
www.prajasakti.com

మున్సిపల్ అధికారుల గైర్హాజరుపై ఈఆర్ఓ ఆగ్రహం

రాయదుర్గం : మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల జాబితాలో అందిన ఫిర్యాదులపై చర్చించేందుకు నిర్వహించిన సమావేశానికి పురపాలక సంఘం తరపున అధికారులు గైర్హాజరు కావడంపై నియోజకవర్గ ఈఆర్ఓ కరుణకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఆర్ఓ అధ్యక్షతన బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇందులో టిడిపి, సిపిఎం, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీల ప్రతినిధులు తప్పులను ఎత్తిచూపారు. ఈఆర్ఓ మాట్లాడుతూ ఫిర్యాదు చేస్తే వారం రోజుల్లోగా విచారణ జరిపి సరిదిద్దుతామని తెలిపారు. సమావేశంలో మండల స్థాయి ఎన్నికల అధికారులు, తహశీల్దార్లు, బిఎల్వోలు, సెక్టార్ అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై సిఐని ప్రశ్నించిన మున్సిపల్ చైర్‌పర్సన్

రాయదుర్గం : 'ఆడుదాం ఆంధ్ర' ముగింపు కార్యక్రమంలో తనపై 21వ వార్డు కౌన్సిలర్ డిష్ గోవింద ఉద్దేశపూర్వకంగా పూలు చల్లాడని చేసిన ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాలు శిల్ప సిఐ శ్రీనివాసులును ప్రశ్నించారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం నిర్వహించిన సమావేశం అనంతరం ఛైర్‌పర్సన్ శిల్ప ఫిర్యాదుపై సిఐతో మాట్లాడారు. ప్రసన్న వెంకటరమణస్వామి రథోత్సవంలో కూడా గోవింద అనుచరులతో తనపై రాళ్లు వేయించారని ఆరోపిం చారు. దీనిపై సిఐ వివరణ ఇస్తూ కేసు నమోదు చేశామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా' ఖోఖో పోటీల విజేత జెఎన్‌టియు

అనంతపురం : 'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీ(పురుషుల విభాగం)ల్లో అనంతపురం జెఎన్‌టియు విద్యార్థులు విజేతగా నిలిచారు. ఈ నెల 28వ తేదీ నగరంలోని పిటిసి గ్రౌండ్‌లో జరిగిన ముగింపు వేడుకల్లో జెఎన్‌టియు క్రీడాకారులు మేయర్ మహ్మద్ వసీం నుంచి ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్స్‌తో పాటు రూ. 35వేల నగదు అందుకున్నారు. పోటీల్లో కె.పవన్‌కుమార్, టి.భవా ని, శంకర్, అవినాష్, కె.ప్రవీణ్, పి.వంశీకృష్ణ, కె.దిలీప్, సూర్య, సాయితేజ పాల్గొన్నారు. వీరికి విసి ఆచార్య జివిఆర్.శ్రీనివాస రావు, రెక్టార్ ఆచార్య ఎం.విజయకుమార్, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి అభినందించారు.

3న మండల సర్వసభ్య సమావేశం

నార్పల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ దివాకర్ తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలన్నారు. అనుమతి లేకుండా గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెద్దపప్పూరు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్ఐ శరత్‌చంద్ర రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరూ సమస్యల జోలికి పోకుండా ప్రశాంతంగా జీవించాలని, సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మీరు చేసే తప్పుల వల్ల పిల్లల భవిష్యత్తు దెబ్బతినవచ్చని, కావున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

టిడిపి శ్రేణులకు శిక్షణ

పామిడి : పట్టణ 11వ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎంహెచ్.లక్ష్మినారాయణరెడ్డి నివాసంలో బుధవారం యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, టిడిపి కుటుంబ సభ్యులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ ఆదినారాయణ మాట్లాడుతూ ఈ 70 రోజులు పార్టీ శ్రేణులు ఎలా ముందుకు వెళ్లలనే అంశంపై అవగాహన కల్పించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ పథకాలు, రిజిస్ట్రేషన్, ఓటరు వెరిఫికేషన్, తదితరుల అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పంట రుణాలు రీ షెడ్యూల్ చేయాలి

శింగనమల : ఖరీఫ్ పంట రుణాలు తీసుకున్న రైతులకు రీ షెడ్యూల్ చేసి అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని తరిమెల గ్రామంలో అనంత గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కి వినతి పత్రం ఇచ్చారు. నాగరాజు మాట్లాడుతూ 2023-24 ఖరీఫ్ పంట రుణాలు రీ షెడ్యూలు చేయాలని కోరారు. స్పందించిన మేనేజర్ హెడ్ ఆఫీస్ నుంచి ఎలాంటి ఆర్డర్ కాపీ రాలేనందున ఇప్పుడే రుణాలు రీ షెడ్యూల్ చేయలేమని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు భాస్కర్, ఆవుల రామాంజనేయులు, సుంకన్న పాల్గొన్నారు

ఇంటర్న్‌షిప్‌తో ఉపయోగం

అనంతపురం : సాంకేతిక విద్యార్థుల్లో ఫ్యూచర్ స్కిల్స్ పెంపుదలకు ఇంటర్న్‌షిప్ చాలా ఉపయోగపడుతుందని జెఎన్‌టియు ప్రొఫెసర్ కె.మాధవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా జెఎన్‌టియు పరిధిలోని బిటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న ఒక్కో విద్యార్థి వారానికి రెండు రోజులు పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు ట్యాబ్‌ల వాడకం, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ తరగతుల బోధనపై శిక్షణ ఇస్తారన్నారు. ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు నెలకు రూ. 12వేల గౌరవ వేతనం, ప్రయాణం ఖర్చులు, దినభత్యం ఇస్తుందన్నారు.

ఉత్తమ విఆర్‌ఒకు సన్మానం

నార్పల : మండలంలోని సిద్ధిరాచర్ల విఆర్ఒ మౌనికలక్ష్మి రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి నుంచి ఉత్తమ విఆర్ఒ అవార్డు అందుకున్నారు. దీంతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ హరికుమార్, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహ, ఆర్ఐ లక్ష్మీజ్యోతి, కార్యాలయ సిబ్బంది, తోటి విఆర్ఒలు ఘనంగా సన్మానించారు.

ప్రజా శ్రేయస్సే సిఎం జగన్ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నార్పల

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా సిఎం జగన్ పాలన సాగుతోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. ఎమ్మెల్యే బుధవారం నార్పలలో తహశీల్దార్ కార్యాలయ తాత్కాలిక భవనంతో పాటు మండలంలోని బొందలవాడ, చామలూరు, సిద్ధిరాచర్ల గ్రామాల్లో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయాన్ని తాత్కాలికంగా బాలుర పాఠశాల అదనపు తరగతి గదుల్లో ఏర్పాటు చేశామని, త్వరలోనే ప్రజలు, సిబ్బందికి సౌకర్యవంతంగా శాశ్వత భవన నిర్మాణం చేపడుతామని తెలిపారు. సిఎం జగన్ రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఏర్పాటు చేయడంతో పాటు వాటికి శాశ్వత భవనాలను కూడా ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, ఎంపిపి నాగేశ్వరరావు, ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ హరికుమార్, సిఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ లక్షీనరసింహులు, ఇఒఆర్డీ శైలజ, ఆర్ఐ జ్యోతిరాణి, వైస్ ఎంపిపి మల్లేశ్వరయ్య, ఎంపిటిసిలు కాటమయ్య, పద్మాకర్‌రెడ్డి, సిఎస్‌డిటి రాజశేఖర్, సర్వేయర్ బ్రహ్మానందం, నాయకులు కేశవరెడ్డి, విఆర్ఒలు పాల్గొన్నారు.

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కాలనీల్లో సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-అనంతపురం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నగరంలోని కల్పనాజోష్, భాగ్యనగర్, బిందెల కాలనీల వాసులు జనసేనపార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ నేతృత్వంలో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమికి వినపత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ ఆయా కాలనీలను సందర్శించి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టిసి వరుణ్ మీడియాతో మాట్లాడుతూ నగరంలో రూ. కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని చెబుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇదేనా మీరు చేసిన అభివృద్ధి ఆయా కాలనీల్లో ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగునీటి ఫొటోలను చూపించి ప్రశ్నించా రు. స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు జయరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, కాయగూరల లక్ష్మీపతి, జిల్లా కార్యదర్శులు రాపా ధనుంజ య్, సంజీవరాయుడు, ఇండ్ల కిరణ్‌కుమార్, సిద్ధూ, జయమ్మ, ఆవుకు విజయ్‌కుమార్, ముప్పురి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ గౌతమికి వినతి ఇస్తున్న టిసి వరుణ్

బిసివై పార్టీ శింగనమల అభ్యర్థిగా మీసాల నారాయణస్వామి

ప్రజాశక్తి-తాడిపత్రి

శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి బిసివై పార్టీ తరపున బరిలో దిగుతున్నట్లు మీసాల నారాయణస్వామి తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్రయాదవ్‌ను కలిసి శింగనమల నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థిగా అంగీకరించినట్లు ఆయన తెలిపారు. మీసాల నారాయణస్వామికి తాడిపత్రిలో విద్యాసంస్థలు ఉన్నప్పటికీ ఆయన స్వగ్రామం పుట్లూరు మండలం అరకటివేముల గ్రామం. మీసాల నారాయణస్వామి శింగనమల నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. మంచి మనిషిగా, సౌమ్యుడిగా గుర్తింపు ఉంది. కార్యక్రమంలో లాయర్ ఓబులేసు, తక్కలపల్లి పుల్లారెడ్డి, చింతకుంట నాగార్జున, యల్లనూరు సుబ్బారాయుడు, బొందలదిన్నె లింగమయ్య, బుగ్గ కంబగిరి, దేవగుడి గంగాధర పాల్గొన్నారు.

రామచంద్రయాదవ్‌ను కలిసిన మీసాల నారాయణస్వామి

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ

బెళుగుప్ప : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో 2022 ఏప్రిల్ నుంచి 24 జనవరి వరకు సామాజిక తనిఖీలు నిర్వహించారు. వాటిపై బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఎంపిపి పెద్దన్న అధ్యక్షతన ప్రజా వేదిక నిర్వహించగా డ్వామా పిడి వేణుగోపాల్‌రెడ్డి, ఎపిడి సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపిడిఒ రామచంద్ర హాజరయ్యారు. మండల వ్యాప్తంగా హౌసింగ్, పంచాయతీరాజ్, ఉపాధి హామీ ద్వారా 1,386 పనులకు గానూ రూ. 7.44 కోట్లు కేటాయించగా అందులో రూ. 17,728 రికవరీ చేయాలని గుర్తించారు. రూ. 67వేల పనులకు సంబంధించి సక్రమంగా ఫొటోలు అప్‌లోడ్ చేయలేదని గుర్తించారు. ప్రజావేదికలో ప్రజలు, కూలీలు పాల్గొనలేదు. గ్రామాల్లో దండోరా కూడా వేయించకుండా సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు పలువురు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ లోకేష్, సామాజిక తనిఖీసిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర'

అనంతపురం కలెక్టరేట్ : 'చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర' సందర్భంగా గురువారం నగరంలోని పాతూరులో వెలసిన బ్రహ్మంగారి గుడి వద్ద నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి పిలుపునిచ్చారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి పెద్ద మారెప్ప, పార్లమెంటు అధ్యక్షులు పోతుల లక్ష్మినరసింహులు, నగర అధ్యక్షుడు పూలబాషా పాత్రికే యుల సమావేశంలో మాట్లాడారు. టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గుట్టుముక్కల రఘురామరాజు నేతృత్వంలో 'చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర' టెక్కలి నుంచి ఇచ్ఛాపురం వరకూ సాగుతోంద న్నారు. అందులో భాగంగా అనంతపురం వస్తున్న బస్సుయాత్ర అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు వన్నూరు, అధికార ప్రతినిధి నిట్టూరు శివాజీ, బాలనాగేంద్ర, ట్రైలర్ యూనియన్ నాయకులు ముత్యాలు, రంగనాథ, షెక్షావలి, శ్రీనివాసులు, రాము పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు కృషి చేద్దాం

ఉరవకొండ : కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాకెట్ల పీహెచ్సీ ప్రభుత్వ వైద్యాధికారి వెంకటేష్ నాయక్ సూచించారు. కుష్టు వ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని రాకెట్ల తండాలో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకూ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, ఎంపిహెచ్ ఎస్ శేఖర్, సిఒ భగవాన్ దాస్, ఎఎన్ఎం పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ రఘునాథ్ పాల్గొన్నారు.

గుత్తి : వైద్యసిబ్బంది మండలంలోని బేతాపల్లి, అబ్బేదొడ్డి, పేదొడ్డి, కరిడికొండ గ్రామాల్లో ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్, కుష్టువ్యాధి నివారణ అధికారి వైద్యం వెంకటేశ్వర్లు ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు.

ఉద్యోగ విరమణ సహజం

గుత్తి : ప్రతి ఉద్యోగి జీవితంలో బదిలీ, ఉద్యోగోన్నతి, విరమణ తప్పనిసరి అని ఎంపిపి జి.విశాలాక్షి పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఎంపిడిఒ చిత్రా శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ రవీంద్రలను బుధవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒఆర్డీ శివాజీరెడ్డి అధ్యక్షతన సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. డిఎల్‌డిఒ ఓబుళమ్మ, మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషా, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ జివి.రాజ్‌కుమార్, ఎఇ మంజునాథ్ పాల్గొన్నారు.

'ఉమర్ అలీషా దివ్య భావలహరి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ అలీషా 58వ జన్మదిన వేడుకలు బుధవారం రూరల్ మండలంలోని కురుకుంట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పతికి రమేష్ నారాయణ రచించిన 'దార్శనిక చక్రవర్తి డాక్టర్ ఉమర్ అలీషా దివ్య భావలహరి' పుస్తకాన్ని సీనియర్ జర్నలిస్ట్ గుంటి మురళీకృష్ణ ఆవిష్కరించారు. భీమవరం వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో తృతీయ బహుమతి గెలుచుకున్న 'మాపటేల' దినపత్రిక సంపాదకులు గాజుల నాగభూషణంను సత్కరించారు. జిల్లా ఉమర్ అలీషా సాహితీ సమితి ప్రతినిధులు రియాజుద్దీన్, సుంకర రమేష్, తోట నాగరాజు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి భరత్, జయ మారుతి, కమలనాథ్, ముస్తాక్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ నాగేంద్ర, సర్పంచి కరుణకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మధ్యాహ్నం నారాయణ సేవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్లు, సాహితీ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పతికి రమేష్, తదితరులు

దినసరి సంత మార్కెట్ వేలంకు కాంట్రాక్టర్లు డుమ్మా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాబోయే ఆర్థిక సంవత్సరానికి నగరంలోని దినసరి సంత మార్కెట్ వేలం, దినసరి సుంకం వసూలు చేసుకునేందుకు బుధవారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం రెవెన్యూ విభాగంలో నిర్వహించిన వేలంకు కాంట్రాక్టర్లు దూరంగా ఉండిపోయారు. సంత వేలం పాట నిర్వహణకు కార్పొరే షన్ కమిషనర్ హాజరుకాపోవడం గమనార్హం. వేలం పాటకు సంబంధించిన సమాచారం పత్రికలకు కూడా ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగం తీరుకు నిరసనగానే కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొనలేదని తెలుస్తోంది. దినసరి సంత మార్కెట్ సుంకం వసూలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. తమ సమస్యలను పరిష్కరించే దిశగా మున్సిపల్ కమిషనర్ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండాపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

పామిడి : మండలంలోని కొండాపురం 2వ వార్డులో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం పార్లమెంట్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు హిమబిందు మాట్లాడుతూ టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. చంద్రబాబు ప్రజల కోసం సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టోలో పలు పథకాలను ప్రకటించారన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌బాబు, బాలరాజు, లక్ష్మయ్య, అల్లీపీరా, ప్రతాప్, తిరుపాలు, చాగంటి గోవిందరాజులు, రామయ్య, నారాయణ, కదిరప్ప, మనోహర్, ఉమానాయక్, రాధా, జానకి, అరుణ, మాధవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

పామిడి : వృత్తి విద్య ద్వారా ఉపాధి అవకాశాలు ఉంటాయని హెచ్ఎం రామ్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ టిసి ఉన్నత పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు బుధవారం పట్టణంలోని ఎస్-మార్ట్ వాటర్ ప్లాంట్ యాజమాన్యం వాటర్ ప్లాంట్ పనితీరు, ప్రయోజనాలపై అవగాహన కల్పించా రు. ముందుగా విద్యార్థులు హైస్కూల్ నుంచి ర్యాలీగా ఆర్ఓ వాటర్ ప్లాంట్‌కు వెళ్లి సందర్శించారు. హెచ్ఎం రామ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధికి అవసరమయ్యే నైపుణ్యాలను అందించడం ద్వారా విద్యార్థులు చిన్న వయసులోనే పరిశ్రమల పనితీరు తెలుసుకుంటారన్నారు. వాటర్ ప్లాంట్ యజమాని మాట్లాడుతూ నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల శుద్ధ, వృథ జలాలతో ప్రజలు ఎక్కువగా అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వీటిని నివారించేందుకు ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి శుద్ధ జలాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయులు సత్యం, రంగప్ప, మల్లికార్జున, ఇమ్రాన్ అలి, నరేష్, ఆంటొనీ, రమాదేవి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

వేతనాలకై పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండలంలోని గన్నేవారిపల్లి పంచాయతీ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఎంపిడిఒ రంగారావుకు వినతి పత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వేతనాల కోసం పలు మార్లు ధర్నాలు చేసి వినతి పత్రాలు అందజేసి నా అధికారులు తాత్కాలికంగా రెండు, మూడు నెలల వేతనాలు చెల్లిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మూడేళ్ల నుంచి భద్రతా పరికరాలు కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. స్పందించిన ఎంపిడిఒ రంగారావు, ఇఒఆర్‌డి జిలాన్‌బాషా ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో సిఐటియు నాయకులు రామాంజి, జుబేర్, ధనలక్ష్మి, ఓబయ్య, రామయ్య, బా షా, కోమలి, నాగరాజు, పంచాయతీ కార్మికులు రా జు, రామకృష్ణ, సంధ్యాబాయి, కుళ్లాయప్ప పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం ముందు బైఠాయించిన పారిశుధ్య కార్మికులు

మున్సిపల్ కార్మికులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే కార్మికులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ ఎం.గౌతమికి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై అర్బన్ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి స్వయంగా కలెక్టరేట్ వెళ్లి కలెక్టర్‌తో చర్చించారు. మున్సిపల్ కార్మికులు ఇప్పటికే ఉప్పరపల్లి గ్రామ సమీపంలో భూమిని శుభ్రం చేసుకున్నారని అందులో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిఐటియు నాయకులు కోరారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందిస్తూ ఆ భూమి వివరాలు సేకరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు ఎం.ఆదినారాయణ, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని మరోమారు ఆదరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రజలు మరోమారు వైసిపినే ఆదరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోరారు. మండలంలోని దేవునిఉప్పలపాడు, చెర్లోపల్లి గ్రామ సచివాలయాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లోనే అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో సిఎం జగన్ గ్రామ సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీకాంత్‌నాయక్, ఇఒఆర్‌డి కమలాబాయి, ఎంపిపి రామిరెడ్డి, జడ్పిటిసి రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, నాయకులు రామ్మూర్తిరెడ్డి, సర్పంచులు రామేశ్వర్‌రెడ్డి, కాటమయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, రాంబాబు, లక్ష్మిరెడ్డి, శివారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. చిన్నపప్పూరు గ్రామంలో వెలసిన పప్పూరమ్మదేవత ఆలయ పునః నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని పాళ్యం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన సబ్‌స్టేషన్‌ను బుధవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు 20ఏళ్ల నుంచి లో వోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం మా దృష్టికి రాగా సిఎం జగన్ సహకారంతో నూతన్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయించామన్నారు. దీని ద్వారా పాళ్యం తండా, కత్రిమల, అప్పాజీపేట, వాటర్ వర్క్స్‌కు విద్యుత్ అందుతుందన్నారు. కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, వెంకటేష్‌నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగూర్ ఈశ్వర్‌రెడ్డి, నారాయణస్వామి, అనుంపల్లి సూరి, నరసిం హ, మీసాల రామచంద్ర, రామ్‌నాథ్‌రెడ్డి, రామ్మోహన్, సత్తి, సూరి, రాజు, గోపాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవిఆర్

గజరాంపల్లిలో 'వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్'

త్వరలో చంద్రబాబు చేత ప్రారంభోత్సవం : పిజెఆర్

ప్రజాశక్తి-పామిడి

టిడిపి అధినేత చంద్రబాబు సహకారంతో మండలంలోని గజరాంపల్లి గ్రామంలో 5 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించేలా 'వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్' పరిశ్రమ ఏర్పాటు చేశామని, త్వరలో చంద్ర బాబు చేత ప్రారంభోత్సవం చేయిస్తామని గుంతకల్లు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ పనిముట్ల సేకరణ తయారీ కేంద్రాలు, రైతులు పంటలు నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ యూనిట్స్, పంటలను ప్రాసెస్ చేసి ఎగుమతి చేసే యూనిట్స్, విండ్ మిల్స్ అండ్ సోలార్ పవర్ జనరేషన్ యూనిట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. టిడిపి హయాంలో చంద్రబాబు ఉమ్మడి అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. మాట చెప్పి మడమ తిప్పడం జగన్ నైజం.. చెప్పారంటే చేసి చూపించేది బాబు నైజం అన్నారు. వైసిపి పాలనలో ఎపిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఇసుక, లిక్కర్ మాఫియా, భూదందాలు, మహిళలపై అత్యాచారాల ఈ ఐదేళ్లలో ఎక్కువయ్యాయన్నారు. ఒక్క పరిశ్రమ తెచ్చిన పాపాన పోలేదన్నారు. యువతకు ఉద్యోగాలు లేక కూ పనులు చేసుకుంటున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేదన్నారు. జగన్ పాలనలో ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయన్నారు. ఎపికి పరిశ్రమలు రావాలన్నా, యువతకు ఉద్యోగాలు రావాలన్నా, మహిళలు సంక్షేమంగా ఉండాలన్నా, రైతులు ఆనందంగా ఉండాలన్నా టిడిపి అధికారంలోకి రావాలని, చంద్రబాబుని సిఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పెరుమాళ్ల జీవానందరెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని బసినేపల్లితండా శివారులో బుధవారం ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొని విష్ణునాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బసినేపల్లి తండాకు చెందిన విష్ణునాయక్ బైక్‌పై గుత్తికి వచ్చాడు. పని ముగించుకొని తిరిగి స్వగ్రామం వెళుండగా పత్తికొండ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

ఉరవకొండ : విడపనకల్లు మండలంలోని గాజుల మల్లాపురంలో మంగళవారం రాత్రి వైసిపి నాయకుడు, రైతు వన్నారెడ్డికి చెందిన గడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో రూ. 1.5 లక్షల విలువ చేసే గడ్డి కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న ఎంపిపి కరణం పుష్పవతి భీమిరెడ్డి, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, గాజుల చిన్న వెంకటేష్, పెద్ద వెంకటేష్, డిష్ వెంకటేష్, కావలి వెంకటేష్, శంకర్‌గౌడ్ ఆ గ్రామం వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించి రైతు వన్నారెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ వన్నారెడ్డిని ఆర్థికంగా దెబ్బతీసేందుకు పిరికిపందెల ఈ చర్యలకు పాల్పడ్డారని, పోలీసులు వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

రైతు సంఘం మాజీ నాయకుడు మృతి

పామిడి : మండలంలోని పామిడి కొత్తపల్లికి చెందిన ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ మాజీ మెంబర్ పోలారెడ్డి(65) బుధవారం మృతి చెందారు. ఆయనక ఓ కుమారుడు ఉన్నారు. అతను కమ్యూనిస్టు పార్టీలో చేరి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. సిపిఐ, సిపిఎంలో పని చేశారు. రైతు సంఘం నాయకుడిగా మండల, జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేశారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం, ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ మెంబర్ అనిమిరెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు రహీం, చౌడప్ప, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, మండల వామపక్ష పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

IN THE COURT OF MOTOR ACCIDENT CLAIM TRIBUNAL CUM DISTRICT JUDGE, MAHABUBNAGAR
M.V.O.P. No. 77/2020

Between:
Akkapalli Anasuya and other
...Petitioner And
Anjaiah and others **...Respondent**

NOTICE

To,
Jetti Jaya Krishna S/o J Mallikarjuna, Aged: Major, Occ: Owner of DCM bearing no AP 02 TC 2470, R/o H No: 4-12, Yangannapalli, Gooty, Anantapur, Andhra Pradesh **...Respondent No. 2**

Take notice that the above O.P filed for compensation under section 166 of M.V.Act, 1988 against you and another and it is posted on 23/02/2024 for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Court on 23/02/2024 at 10.30 AM the petition will be decided ex-party.

"By the order of the Court"
Mahabubnagar.
Date:30/01/2024

G Karthik, B.Tech.,LL.B,
Advocate,
H.No.7-4-5/2, Venkateshwara colony,
Mahabubnagar.

బహిరంగ ప్రకటన

కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము, శ్రీ కాశీ విశ్వేశ్వర & కోదండరామస్వామి దేవస్థానము, 1వ రోడ్డు, అనంతపురం పట్టణము, అనంతపురం జిల్లా.

పై దేవస్థానము నందు 2024 సంవత్సరము మార్చి నెల యందు జరుగు మహాశివరాత్రి బ్రహ్మోత్సవముల సందర్భంగా ఈ క్రింది తెలిపిన పనులకు గాను కొటేషన్లను ఆహ్వానించడమైనది. (1) దేవస్థానము, కాంపౌండు వాల్, రూములు మొదలగు వాటికి సున్నముపూతలు వేయుటకు సున్నము తదితర వాటిని సప్లయ్ చేయుటకు (2) సున్నము పూతలు వేయుటకు కూలీలు (3) పెయింటింగ్స్ విమాన గోపురములు, సాలాహారము తదితర వాటికి పెయింటింగ్స్ సప్లయ్ చేయుటకుగాను (4) పెయింటింగ్స్ వేయుటకు కూలీలు (5) దేవాలయం వద్ద చలువ పందిర్లు క్యూలైన్ ఏర్పాటు చేయుట (6) విద్యుత్ అలంకరణ (7) పూల డెకరేషన్ (8) దేవస్థానములో తాత్కాలిక మరమ్మత్తులు (9) దేవస్థానము నందు యల్ఇడి టి.వి.లు ఏర్పాటు & సి.సి.కెమెరాలు ఏర్పాటు చేయుట తదితర పనులకు ఆసక్తి గల వారు తమ కొటేషన్లను ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోపల పంపవలసినదిగా కోరడమైనది.

ఆలయ కమిటి చైర్మెన్ & ధర్మకర్తలు
తేది:30/01/2024

కార్యనిర్వహణాధికారి,
శ్రీ కాశీ విశ్వేశ్వర & కోదండరామాలయము
1వ రోడ్డు, అనంతపురం

బహిరంగ ప్రకటన

కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము, శ్రీ కొండమీద వెంకటరమణస్వామి దేవస్థానము, బుక్కరాయసముద్రం గ్రామము మరియు మండలం, అనంతపురం జిల్లా.

పై దేవస్థానము నందు 2024 సంవత్సరము ఫిబ్రవరి నెల 17 తేది నుండి 26వ తేది వరకు జరుగు బ్రహ్మోత్సవముల సందర్భంగా ఈ క్రింది తెలిపిన పనులకు గాను కొటేషన్లను ఆహ్వానించడమైనది.(1) దేవస్థానము సత్రములు, కాంపౌండు వాల్, రూములు మొదలగు వాటికి సున్నముపూతలు వేయుటకు సున్నము తదితర వాటిని సప్లయ్ చేయుటకు (2) సున్నము పూతలు వేయుటకు కూలీలు (3) పెయింటింగ్స్ విమాన గోపురములు, సాలాహారము తదితర వాటికి పెయింటింగ్స్ సప్లయ్ చేయుటకుగాను (4) పెయింటింగ్స్ వేయుటకు కూలీలు (5) దేవాలయ ఆలయ ఆవరణములో ఉన్న వసతి గదులకు డిస్టంబరు మరియు ఎమల్షన్ పెయింట్స్ వేయుటకు మరియు లేబరు కూలీలకు (6) దేవాలయ పరిసర ప్రాంతాలు మరియు రథోత్సవము తిరుగు రస్తా కొండపైకి వెళ్ళు మెట్లమార్గము, రోడ్డుకు ఇరువైపుల వున్న ముళ్ళచెట్టను తొలగించుట, జెసిబితో క్లీనింగ్ చేయుటకు (7) దేవాలయం వద్ద చలువ పందిర్లు, క్యూలైన్ ఏర్పాటు చేయుట (8) విద్యుత్ అలంకరణ (కొండపైన మరియు గ్రామము నందు ఉన్న దేవాలయములకు విద్యుత్ అలంకరణ) తదితర పనులకు ఆసక్తి గల వారు తమ కొటేషన్లను ఈ ప్రకటన వెలువడిన 5 దినముల లోపల పంపవలసినదిగా కోరడమైనది.

ఆలయ కమిటి చైర్మెన్ & ధర్మకర్తలు
తేది:30/01/2024

సాకే రమేష్ బాబు, కార్యనిర్వహణాధికారి,
శ్రీ కొండమీద వెంకటరమణస్వామి దేవస్థానము
బుక్కరాయసముద్రం